అవసరాన్ని బట్టి నెల్లూరులో రెండు మూడు రోజులుండి ఆ తర్వాత ఇంటికి వెళ్తానని, తల్లిదండ్రులతో మాట్లాడిన తర్వాత పెళ్ళి ఎప్పుడు ఏమిటి అనేవి నిర్ణయించుకోవచ్చని విష్ణు చెప్పారు. నా ఫైనల్ ఎగ్జామ్స్ అయిన తర్వాతనే కాబట్టి తొందరేం లేదని నాన్నగారూ వాళ్ళూ అనుకున్నారు.

విష్ణు వెళ్ళిన వారం పదిరోజుల వరకూ ఫోను చేయకపోయేసరికి నాకు ఆందోళన కలిగింది... ఇంట్లో వాళ్లు ఈ పెళ్ళికి అంగీకరించలేదా... ఆ విషయం చెప్పటానికి ఇబ్బందిగా ఉండి ఫోన్ చేయలేదా? అంకుల్ ఫోన్ చేస్తే సెల్ ఆఫ్ చేసి ఉందని అన్నారు. "కొన్నాళ్ళు ఎదురు చూద్దాం... వాళ్ళేం ఆలోచించుకుంటున్నారో టైము తీసుకోనిద్దాం" అని సలహా ఇచ్చారు. అంతకు మించి చేసేదేముందని నాకు అనిపించింది. నా ఆలోచనలు మాత్రం పరి పరివిధాలుగా పోతున్నాయి. స్థిమితంగా ఉండటం లేదు.

పదిహేనురోజుల తర్వాత అంకుల్‌కి విష్ణు దగ్గర్నుండి ఫోన్ వచ్చింది. విష్ణు నాన్నగారికి పెరాలసిస్ రావటం వలన హాస్పిటల్‌లో చేర్పించారు. ఆ హడావుడిలో ఉన్నారట. ఈ విషయం తెలిసి అందరం బాధపడ్డాం. ఆ తర్వాత విష్ణు మాతోనూ మాట్లాడారు.

షుమారుగా నెలరోజుల పైనే హాస్పిటల్‌లో ఉంచి విష్ణు నాన్నగారిని ఇంటికి తీసుకువచ్చారు. కాలూ, చెయ్యి కొంచెం స్వాధీనంలోకి వచ్చినా గానీ ఆయన ఆరోగ్యంలో తేడా వచ్చింది. ఎవరినీ గుర్తుపట్టనట్లుగా కోమాలాంటి స్థితిలో ఉన్నారట!

నేను పూర్తిగా ఎగ్జామ్స్ మీద దృష్టి పెట్టి చదువులో మునిగిపోయాను. నా ఎగ్జామ్స్ అయిన రెండు రోజులకి విష్ణు వచ్చారు.

విష్ణులో ఏమిటో చాలా మార్పు వచ్చింది. ఆశ్చర్యంగా అనిపించింది. అలసటగానే కాదు, ఏదో శక్తికి మించిన భారాన్ని మోస్తున్నట్లుగా కనిపించారు! విష్ణు మనసులోని దిగులునంతటినీ దోసిళ్ళతో తోడి పారెయ్యగలిగే శక్తి నాకు ఉంటే ఎంత బాగుండునూ అనుకుంటూ నిట్టూర్చాను.

విష్ణులో అంత మార్పుకు తండ్రి అనారోగ్యమే కాకుండా బిజినెస్‌లో చిక్కులు కూడా తోడయ్యాయేమో అనిపించి ఆ మాట విష్ణును అడిగాను. వెనక్కి జార గిలబడి తలక్రింద రెండు చేతులూ పెట్టుకుని గట్టిగా నిట్టూర్చి “ఒక రకంగానే కాదు సుజనా… ఏమిటో చాలా రకాలుగా ఒత్తిడి ఉంది. ప్చ్… అవన్నీ తర్వాత మాట్లాడుకుందాంలే..” అన్నారు. తర్వాత మళ్ళీ ‘నీ సంగతులు ఏమిట’ని అడిగారు.

విష్ణు వెళ్ళిన తర్వాత ఫోను చేయకపోవడంతో నేను అనుభవించిన ఆందోళనంతా వెళ్ళగ్రక్కాను. నిజమే, తండ్రికి బాగా లేదు. కానీ, ఆ ఒక్కమాట అయినా చెబితే సరిపోయేదిగా! నాన్నగారు ఏ విషయమూ చెప్పకుండా ఒక్కరోజు ఆలశ్యం చేసినందుకే టెన్షన్ పడ్డానంటూ సీరియస్ అయ్యారు మరి! నా పరిస్థితి ఎందుకు ఊహించలేకపోయారు…?

ఆ మాటే సీరియస్‌గా అడుగుతోంటే విష్ణు చిరునవ్వుతో వినటం నాక్కొంచెం కోపం తెప్పించింది. చురుగ్గా చూస్తూ, “మీకు మాత్రం తమాషాగా అనిపిస్తోందా…?” అనడిగాను.

“నీ చివాట్లు.. నాకలవాటేగా… ఇష్టం కూడానూ!”

“చివాట్లు.. ఇష్టమా?!”

“అవును. అందమైన అమ్మాయి చీవాట్లు అల్లం పెసరట్లంత కమ్మగా ఉంటాయి!” అంటూ నవ్వి “అయితే నీకు బాగా కోపం వచ్చిందన్నమాట!” అన్నారు.

“కోపం… అది రవ్వంతే… బాధే మరింత!” అంటూ నేనూ నవ్వాను.

❋ ❀ ❋

విష్ణు ఇంట్లో పరిస్థితి చక్కబడే వరకూ పెళ్ళి ఆలోచన లేదు కాబట్టి నేనూ ఏదైనా కంప్యూటర్ కోర్సు చేయాలని అనుకున్నాను. నాన్నగారు విష్ణు సలహా కూడా

తీసుకోమన్నారు. విష్ణు కూడా అంతా నా ఇష్టమేనని నా ఆలోచన బావుందని అనటంతో పద్మ వెళ్ళే ఇనిస్టిట్యూట్‌లోనే నేనూ చేరాను. సంగీత సాధనకి మరికొంచెం సమయాన్ని కేటాయించగలుగుతున్నాను.

రిజల్ట్సు వచ్చిన రోజు ఫస్ట్ క్లాసు వచ్చినందుకు విష్ణు కంగ్రాట్స్ చెప్పారు. ఫ్లవర్ బొకే, కేకు షాపు నుండి వచ్చే ఏర్పాటు చేశారు. విష్ణు మాటల్లో మనుపటి హుషారు మాత్రం కనిపించటం లేదు. విష్ణు ఉన్న పరిస్థితుల్లో అది సహజమేనని అనిపించింది.

నాకు మాత్రం... విష్ణు ఆలోచనలతోనే తెల్లవారుతుంది. నిద్రలేవగానే... తన మాటల్ని, నవ్వునీ గుర్తుకు తెచ్చుకుంటూ బద్ధకంగా కాసేపు పక్కమీదే ఉండిపోతాను. పగలంతా ఏ పని చేస్తున్నా లోలోపల ఏం చేస్తున్నారో... ఎలా ఉన్నారో అని విష్ణు ఆలోచనలే! నిద్రపోయే ముందూ అంతే... నిద్రలోనూ అవే కలలు.. అదే కలవరం!

ఇలాగే రోజులు వారాలుగా, నెలలుగా గడిచిపోతున్నాయి.

ఒక రోజు విష్ణు హఠాత్తుగా వచ్చి పెళ్ళి ఆలోచన చెప్పారు. తండ్రి ఆరోగ్యం ఎప్పటికి మెరుగుపడుతుందో డాక్టర్లకే తెలియటం లేదని అందుకే రిజిష్టారు ఆఫీసులో పెళ్ళి జరగటం బావుంటుందని అనుకున్నట్లుగా చెప్పారు.

ఆంటీ, అంకుల్, నాన్నగారు అందరూ కలిసి కూర్చుని మాట్లాడుకుని ఆ పరిస్థితిలో విష్ణు ఆలోచన సరియైనదేని అనుకున్నారు. నన్నడిగితే అభ్యంతరం లేదని చెప్పాను.

నాన్నమ్మకే కొంచెం అసంతృప్తిగా ఉంది... చుట్టపక్కాలు లేకుండా రిజిష్టర్ మ్యారేజి ఏమిటని. కానీ చేయగలిగిందీ ఏమీ కనిపించక సరే అంది.

ఆ తర్వాత నెలా పదిహేనురోజులకే రిజిష్టారు ఆఫీసులో రామబ్రహ్మాం అంకుల్, ఆంటీ, కరుణ, నాన్నగారు, పద్మల సమక్షంలో విష్ణు, నేనూ దంపతులమయ్యాం.

మంగళసూత్రం ఉండాల్సిందేనని నాన్నమ్మ పురోహితులు నిర్ణయించిన సుముహూర్తానికి ఇంట్లో దేముడి ముందు విష్ణుతో నా మెడలో మూడు ముళ్ళు వేయించింది. విష్ణు ఏమీ అభ్యంతరం చెప్పలేదు.

మా వెంట విష్ణు వాళ్ళింటికి ఎవరైనా రావటం అనవసరమేనని, తర్వాతెప్పుడో వీలు చూసుకొని వస్తామని చెప్పారు.

తలుపు చప్పుడైంది.

నందనవనంలో విహరిస్తున్నట్లుగా మైమరిచిపోయిన మనసు ఊహలనుంచి బయటకు వచ్చింది. తలుపు తీసేసరికి నవ్వు మొహంతో ముత్యాలు నిలబడి ఉంది. రుక్మిణమ్మగారు పంపించారంటూ జాజి మొగ్గల మాలను నా చేతికి అందించింది.

❉ ❀ ❉

పద్మ పుట్టినరోజని గుర్తుకు వచ్చి ఉదయమే ఫోన్ చేశాను.

నాలుగు నిమిషాలు సరదాగా మాట్లాడి ఫోన్ పెట్టేసేక విష్ణు "పద్మ సంగతులు ఏమిటి?" అడిగారు.

"మీ నలకూబరుడి సంగతులేమిటీ అని పద్మ అడిగింది..." అంటూ నవ్వాను.

"నలకూబరుడు... ఎవరు?" ఆశ్చర్యంగా చూశారు. "అది మీకు మేం పెట్టుకున్న పేరు..." అంటూ ఆ రోజు పద్మ అన్న మాటల్ని చెప్పాను." "పద్మకిపుడు పెళ్ళి చూపుల సీన్లు జరుగుతున్నాయి. మొన్న ఒక సంబంధం వచ్చి తప్పిపోయింది. దానికీ నచ్చలేదు కాబట్టి శుభం అనుకుందట! నేను పెళ్ళి చూపుల రోజు వేసుకున్న లక్కీ డ్రెస్ ఇమ్మని అడుగుతోంది... తొందరగా సెటిల్ అయిపోతుందని!"

"అదేమిటి... నీకు పెళ్ళి చూపులు ఎప్పుడు జరిగాయి?" ఆశ్చర్యంగా అడిగారు.

నాకు నవ్వొచ్చింది.

"మొదటిసారి మీరు మా ఇంటికి వచ్చిన రోజు... నాకు పెళ్ళి చూపులు జరిగాయని పద్మ సరదాగా అంటుంది. ఆ రోజు నేను వేసుకున్నది లక్కీ డ్రెస్సట...!"

"ఆ డ్రెస్ వేసుకోవటమే కాదు.... నుదుటి మీద మట్టి మరకలు, ముక్కు మీద కొంచెం కోపం కూడా అతికించుకోమని చెప్పు... సరిపోతుంది..." అని నవ్వుతూ "ఈ రోజు టిఫిన్ ఏమిటి?" అనడిగారు ఏవో ఫైల్సు చూసుకుంటూ.

అంతకుముందు క్రిందకు వెళ్ళినప్పుడు శాంతమ్మ రుబ్బిన పెసరపిండిని గిన్నెలోకి తీయడం చూశాను. అందుకే వెంటనే "అందమైన అమ్మాయి చీవాట్లులాంటివి..." చెప్పాను.

ఒక క్షణం ఆలోచించి... అర్థమైనట్లుగా "అల్లం పెసరట్లా...!" అంటూ నవ్వేశారు.

“ఇద్దరికీ ఇక్కడికే తీసుకురా...” హుషారుగా అన్నారు.

నేనూ ఛెంగుమంటూ క్రిందకు వెళ్ళి... శాంతమ్మ వేస్తానంటే... వద్దని చెప్పి... నేనే జాగ్రత్తగా వేసి తీసుకువచ్చాను. అన్నీ రెడీగా ఉన్నప్పుడు వేయటం పెద్ద పని కాకపోయినా ... నేనే వేశానని చెప్పాను.

“నీ చేయి తగిలినందువల్లనే కాబోలు ఇంత రుచిగా ఉన్నాయి!” సరదాగా అన్నారు. ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ తినటమూ నాకు చాలా బావుంది!

“ఇలాంటి చిన్న చిన్న పనులు చేస్తూ కాలక్షేపం చేయటం కాకుండా నీకిష్టమైన వ్యాపకం... స్కూలు పెట్టే విషయం గురించి ఆలోచిస్తున్నాను. కాకపోతే కొన్నాళ్ళు... నా పనులన్నీ ఓ కొలిక్కి వచ్చే వరకూ ఆగాలి మరి...!” విష్ణు అన్నారు.

“నిజంగానా...?” ఆనందంగా అడిగాను.

అవునన్నట్లుగా తల ఊపగానే... విష్ణు మెడ చుట్టూ చేతులు వేసి చెంపకు పెదాల్ని ఆనించాను. నేను థేంక్స్... చెప్పే పద్ధతి అదని విష్ణుకూ తెలుసు!

విష్ణు కూడా నా నడుం చుట్టూ చేతులు వేసి, “అసలే తనివి తీరని కొత్తమోజు...! ఆపైన నువ్విలా కవ్వించావంటే... ఆలోచించుకో నీకే కష్టం... రోజంతా ఇలా నా చేతుల్లో బందీగా ఉండిపోవాల్సి వస్తుంది...!” అన్నారు.

“ఫరవాలేదు... నాకది ఇష్టమైన కష్టమే...” అంటూ నవ్వాను.

ఇద్దరం నవ్వుకుంటూ తలుపులు తీసేసరికి అత్తయ్య తన గది గుమ్మం ముందు నిలబడి ఉన్నారు.

నవ్వు మొహాలతో బయటకు వచ్చిన మమ్మల్ని చూడగానే అత్తయ్య మొహంలోకి ఏదో అప్రియభావం వచ్చినట్లుగా అనిపించింది! నిజమేనా... లేక నేను పొరబడుతున్నానా.. తెలియటం లేదు.

విష్ణు తల్లికి వెళ్ళొస్తానంటూ చెప్పి చకాచకా మెట్లు దిగి వెళ్ళిపోయారు.

అత్తయ్య అక్కడి నుండే నీరజను రమ్మని కేక పెట్టి లోపలకు వెళ్ళిపోయారు. కాళ్ళు నేలకి అంటుకుపోయి కదల్లేనట్లుగా రెండు నిముషాలు అక్కడే నిలబడిపోయిన నేను తర్వాత మెల్లగా లోపలకు వెళ్ళిపోయాను.

# 6

కాసేపటి తర్వాత బయటకు వచ్చేసరికి ముత్యాలు, డ్రైవర్లు, అత్తయ్య గదిలో నుండి సామాన్లను క్రిందకు చేరవేస్తూ కనిపించారు. ఆ గది ముందే ఉన్న నీరజను పిలిచి విషయం ఏమిటని అడిగాను. నీరజ సమాధానానికి నాకు షాక్ తగిలినట్లయింది.

అత్తయ్యకు ఎందుకనో అక్కడ ప్రశాంతంగా లేదట! క్రింద ఉన్న బెడ్ రూముల్లోకి మారుతున్నారని చెప్పింది. ఆపైన మామయ్యగారిని చూడటానికి డాక్టర్లు వస్తుంటారు కాబట్టి క్రిందయితే అనువుగా ఉంటుందనీ అత్తయ్య అనుకున్నారట.

అత్తయ్యకు ప్రశాంతంగా ఎందుకులేదు...? ఆ మాటే నా మనసులో గుచ్చుకుంది. గది ఎదురుగా ఉంది కాబట్టి తరచూ నన్ను చూడాల్సి రావటమే కారణమా? అలాంటి ఆలోచన రాగానే మనసు విలవిలలాడిపోయింది! అంత తప్పు నేనేం చేశాను? విష్ణు తన మాట వినకుండా నన్ను పెళ్ళి చేసుకున్నందుకైతే కోపం విష్ణు మీద కదా ఉండాలి...?!

మధ్యాహ్నం భోజనం చేయాలనిపించకపోయినా ఏవో కారణాలు చెప్పటం... అదంతా ఎందుకని తిన్నాననిపించి వచ్చేశాను. బాగా నిద్రపట్టింది. లేచి స్నానం చేసేసరికి కొంచెంగా మనసూ తేటపడినట్లుగా అనిపించింది.

ఊరు నుండి ఎవరో బంధువుల పెళ్ళికి వచ్చిన వాళ్ళు నన్ను చూడటానికి ఇక్కడికి వచ్చారని నీరజ నన్ను క్రిందకు రమ్మని చెప్పింది.

“సరే...పద” అంటూ నేనూ వస్తుంటే “అది కాదు... వాళ్ళంతా మన దగ్గర బంధువులు... నువ్వు కొత్త పెళ్ళికూతురివి కదా... చీరె మార్చుకొని... ఏవైనా చిన్న నగలు...” అని నసుగుతూ చెప్పింది.

చిన్న చిన్న పువ్వుల ప్రింట్ వున్న పింక్ కలర్ చీరె కట్టుకుని వున్నాను. మెడలో సన్నని చైను, చేతికి రెండేసి గాజులు అంతేమరి. పెళ్ళి అనుకున్నాక నాన్నమ్మ రెండు మూడు రకాల నెక్లెస్‌లు కొనిపించింది. సింపుల్‌గా ఉండేవే తీసుకున్నాను. ఎక్కడికో ఫంక్షన్‌కి వెళ్తున్నట్లుగా మళ్ళీ అలంకరణ మొదలు పెట్టటం అనవసరమనిపించింది. “ఏం.. వద్దులే... పద...” అన్నాను. నీరజ నగలేమైనా పెట్టుకోమని ఎందుకు సలహా ఇచ్చిందో తర్వాత అర్థమైంది.

గలగల మాట్లాడుకుంటున్న వాళ్ళంతా నన్ను చూడగానే నిశ్శబ్దమైపోయారు! నన్ను అక్కడ ఓ సోఫాలో కూర్చోమని చెప్పి ఇన్‌స్టిట్యూట్‌లో తనకేదో పని ఉందని చూసుకొని వస్తానంటూ నీరజ వెళ్ళిపోయింది.

ఎవరూ ఏం మాట్లాడకుండా నా వేపే కళ్ళప్పగించి చూడటం కొంచెం ఇబ్బందిగా అనిపించింది. పెద్దవాళ్లు కూర్చున్న వేపుకి చేతులు జోడించి అందర్నీ పలుకరిస్తున్నట్లుగా చిరునవ్వుతో చూశాను. బదులుగానైనా ఎవరిలోనూ చిరునవ్వు లేదు!

రెండు నిముషాలకి చలనం వచ్చినట్లుగా మళ్ళీ కబుర్లు మొదలుపెట్టారు. పెళ్ళికి వెళ్ళి వచ్చినందువల్ల కాబోలు అందరూ ఖరీదైన పట్టుచీరెలతో, నగలతో ధగధగలాడిపోతున్నారు! ఇద్దరు లంగా ఓణి వేసుకున్న అమ్మాయిలయితే బంగారపు తొడుగు అనిపించేట్లుగా అన్ని రకాల నగలూ పెట్టుకున్నారు.

అక్కడ లేని ఎవరిగురించో ఏదో చెప్పుకుంటున్నారు కాబోలు, ఒకావిడ "ఖర్చు పెట్టటానికి చేతులు రానప్పుడు ఊరుకోవచ్చుగా, అంత నాసిరకంగా నెక్లెసు చేయించటమెందుకూ" అనగానే చిన్నత్తయ్య "రాజ్యం గురించి కొత్తగా అనుకునేదేముందిలే... ఎప్పుడూ అంతేగా... బియ్యం బియ్యంలాగే కదలకుండా ఉండాలి.... బిడ్డలు మాత్రం బీరగింజల్లా ఉండాలి... అనే రకం కదూ!" అన్నారు.

అందరూ పెద్దగా నవ్వారు.

నాకు కొంచెం దగ్గిరగా కూర్చున్నావిడ తన పక్కన కూర్చున్నావిడ మీదుగా చిన్నత్తయ్య వేపుకి ఒంగి కొంచెం మెల్లని స్వరంతో "చేయించిన నగలు .. మీనాక్షి... కోడలికి ఇవ్వలేదా?" అని అడిగారు. చిన్నత్తయ్య నిట్టూరుస్తూ మెల్లగానే "ఇవ్వకపోవటమేమిటి.. అన్నీ ఇచ్చింది! నగలు పెట్టుకోవటం అలవాటూ లేదట.. ఇష్టమూ ఉండదట!" అన్నారు.

నా ఎదురుగా కూర్చున్న నా వయసు అమ్మాయి ముసిముసిగా నవ్వింది. వేళాకోళంగా కాబోలు! పక్కనే కూర్చున్నావిడ కూడా అలాగే నవ్వుతూ "స్థోమతును బట్టి నగలు పెట్టుకుంటారు... లేకపోతే ఊరుకుంటారు. అంతేగానీ అలవాటు, ఇష్టం లేకపోవటమేమిటీ... విడ్డూరం కాకపోతే!" అన్నారు.

ఆ అమ్మాయికి ఆవిడ తల్లే అయి ఉంటారని అనుకున్నాను. అందరూ మాట్లాడుకోవటానికి ఒక మంచి టాపిక్ దొరికినట్లయింది కాబోలు ఇక అంతే మొదలు పెట్టేశారు.

"పాపం.. తండ్రి బడిపంతులు కదా... నగలు చేయించలేని స్థితిని బయటకు రానీయకుండా నగలంటే ఇష్టం లేదని చెప్పటం... మంచి మాటేకదూ... కన్నవాళ్ళకి చిన్నతనం లేకుండా... తెలివైన అమ్మాయి..."

ఆవిడ మాటలు వింటూంటే... వగచినట్టు, వాత పెట్టినట్టూ మాట్లాడటమంటే ఏమిటో ఆ క్షణం తెలిసింది!

"అవేం తెలివితేటలులే... చీరె, సారెతో ఎంత ఘనంగా అత్తారింటికి పంపిస్తే, పుట్టింటివాళ్ళకి అంత గౌరవం, గొప్ప ఉంటాయి! తల్లి లేదు... తండ్రికి తెలియకపోతే, ఇంట్లో ఒక ముసలావిడ ఉంటుందని అన్నారే... ఆవిడయినా... పిల్లకి ఒంటి మీద ఇంత బంగారం పెట్టి పంపిస్తేనే పద్ధతిగా ఉంటుందని చెప్పొద్దూ...."

"సరేలే... పెద్దవాళ్ళ అవసరం లేదు.... ఈ కాలపు పిల్లలకే అంత తెలివి తేటలుంటున్నాయి! మద్దిపాటి అనంతయ్య మూడో కూతురు నీలవేణి లేదూ... తెలివి తేటలంటే ఆ పిల్లవే! ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసేసరికి అనంతయ్య పనయిపోయింది. నీలవేణి పెళ్ళికి వియ్యాలవారు పిల్లకి ఎంత బంగారం ఉందని అడగలేదు గదాని... నగలేమీ కొనకపోయేసరికి ఆ పిల్ల ఊరుకోలేదు... అత్తారింటికి బోసిగా వెళ్తే ఎంత నామార్దా అని పేచీ పెట్టింది! ఆ మాటా నిజమేగా, ఇక అనంతయ్య మాత్రం ఏం చేస్తాడు... అప్పులో అప్పు అనుకుంటూ బంగారమూ కొన్నాడు!"

నాకు చాలా విచిత్రంగా ఉంది! కన్నవాళ్ళ కష్ట సుఖాలతో తనకేం సంబంధం లేదన్నట్లుగా అప్పు చేయించి నగలు కొనిపించుకోవటం.. తెలివితేటలా..?! స్వార్థం కాదా? పరోక్షంగా నన్ను ఎగతాళి చేయాలనే ఉద్దేశ్యంతో అలా మాట్లాడుతున్నారా... లేక నిజంగానే వాళ్ళ అభిప్రాయాలు అలానే ఉంటాయా...?!

ఇంతలో ఇంకొకామె నాకు చనువుగా ఓ సలహా ఇచ్చారు. "ఇదిగో అమ్మాయ్... నేను చెబుతున్నాను... విను.. జీతం రాళ్ళ మీద బ్రతికే వాళ్ళకి నగలూ...నాణేలూ కొనాలంటే కష్టమే... గొప్పలకు పోయి అప్పులు చేయకపోవటం మంచిపనే! నువ్వు పుట్టింటి నుండి ఏం తీసుకురాలేదని అనుకునేవాళ్ళెవరూ లేరిక్కడ! నీ సుకృతం కొద్దీ ఈ ఇంట్లోకి వచ్చిపడ్డావు! మీ అత్తగారిచ్చిన నగలన్నీ శుభ్రంగా పెట్టుకుని తిరుగు..."

"అవును... మీ ఊళ్ళో అయితే ఫరవాలేదు గానీ... ఇక్కడ నిన్ను మీనాక్షమ్మ కోడలనే అంటారు... ఏ బంధువుల పెళ్ళికయినా ఇలాగే వెళ్తే... మీ అత్తమామలకే పరువు తక్కువ!" అని ఇంకొకరు అన్నారు.

అత్తయ్య కొంచెం అసహనంగా ఏదో అనబోతోంటే... "నువ్వూరుకో మీనాక్షీ... మనింటికి వచ్చిన అమ్మాయికి మన పద్ధతులు చెప్పాలిగా..." ఎవరో పెద్దావిడ కోప్పడ్డారు.

"ఇప్పుడీ మాటలన్నీ ఎందుకూ... అవసరమనిపిస్తే అక్కయ్య చెబుతుంది కదా..." చిన్నత్తయ్య చిరాకు పడగానే ఇంకొకావిడ "అవున్లే కందకు లేని దురద కత్తిపీటకెందుకూ... అన్నారు మరి!" అంటూ నిట్టూర్చింది.

నాకు నగల పట్ల ఆసక్తిలేదని చెబుతూ పుట్టింటి వాళ్ళ పేదరికాన్ని దాచే ప్రయత్నం చేస్తున్నానని వీళ్ళందరి నిశ్చితాభిప్రాయం! నగలంటే ఇష్టం ఉండకపోవటమనే మాటను మించిన అసత్యం మరొకటుండదని వీళ్ళందరూ బాగా నమ్ముతున్నారన్నమాట! నాకు కొంచెం నవ్వు వచ్చింది... కోపమూ వచ్చింది!

వాళ్ళ బంధుత్వాల గురించి చెబుతూ పరిచయాలు గానీ, నా విషయాల్ని అడిగే పలకరింపులు గానీ ఏమీ లేవు! అటువంటి మర్యాద ఏమీ లేదు గానీ.. నన్ను గిచ్చి ఆనందించాలనే ఉబలాటాన్ని మాత్రం చూపించారు! ఏ ఇద్దరు ముగ్గురో నిశ్శబ్దంగా చూస్తున్నారు తప్ప మిగతా అందరిదీ మాత్రం ఒకటే ధోరణి!

నేను... అనంతయ్య గారి మూడో కూతురు అంటూ మాట్లాడిన ఆవిడ వేపూ చూస్తూ మెల్లగా అడిగాను. "మీరు ఇందాక చెప్పారే... నీలవేణి అని తెలివైన అమ్మాయి గురించి... ఆ అమ్మాయి అత్తవారింట్లో సమస్యలేమీ లేకుండా బాగానే ఉందంటారా?"

ఆవిడ మొహం చిట్లించి చూస్తూ "ఆ పిల్ల అత్తారింట్లో ఎలా ఉందో... ఆ గొడవెందుకూ?" అడిగారు.

"అంటే... కన్నవాళ్ళ సమస్యలను పట్టించుకోకుండా నగలే ముఖ్యమన్నట్లుగా పేచీ పెట్టిన అమ్మాయి అత్తవారింట్లో కూడా... వాళ్ళ పరిస్థితులు ఆలోచించకుండా తాహతు మించిన కోరికలతో సమస్యల్ని కొని తెచ్చుకుంటుదేమోనని నాకనిపించింది. అందుకే అడిగాను. ఆ అమ్మాయి చాలా తెలివి తక్కువగా నగల్లేకుండా అత్తవారింటికి వెళ్ళటం నామర్దా అనుకుంది! మంచి ప్రవర్తన ద్వారా పుట్టింటివాళ్ళకు గౌరవం తీసుకురావచ్చనే మాట మరిచిపోయినట్లుంది! మీ లాంటి పెద్ద వాళ్ళయినా మందలించి ఆ నీలవేణికి ఈ మంచి మాట చెప్పొచ్చు కదండీ....!"

నేనలా మాట్లాడతానని ఎవరూ ఊహించలేదనుకుంటా... ఒకే ఒక క్షణం షాక్ తగిలిన వాళ్ళలా బిగుసుకుపోయారు!

ఇక అక్కడ కూర్చోవాలనిపించలేదు. అక్కడున్న ట్రేలో వాళ్ళందరూ తాగిన ఖాళీ కాఫీ కప్పుల్ని పెట్టి వంటగదిలో పెట్టటానికి లేచాను.

నేను వచ్చేస్తుంటే... మాటల విసుర్లు వినిపించాయి.

"అమ్మో... పైకి కనిపించేంత మెత్తన కాదన్న మాట..."

"పెద్ద చిన్న లేకుండా ఎదిరించినట్లుగా ఏం మాట్లాడిందో...."

"ఏమీ లేకపోతేనే ఇలా ఉంది... ఆస్తిపాస్తుల్ని వెంటబెట్టుకు వచ్చుంటే ఇంకెలా ఉండేదో..."

నాకు వినబడకూడదనే ఉద్దేశ్యం వాళ్ళకున్నట్లు లేదు. నేను వినాలనే అలా చురకలేస్తున్నట్లుగా మాట్లాడుతున్నారనిపించింది.

సమాధానం చెప్పకుండా ఉండటం నా వల్ల కాలేదు!

నాలుగడుగులు వేసిన దాన్ని ఆగి కొంచెంగా వెనక్కి చూస్తూ అన్నాను. "నా అభిప్రాయం చెప్పటం ఎదిరించటమవుతుందని నేననుకోలేదండీ.. ఎంత ఉన్నవాళ్ళకైనా అహంకారం ఉండకూడదు... కానీ ఎవరికైనా అభిమానం మాత్రం ఉండాలి!"

ఒకే ఒక సెకను వేపు నా చూపులు అత్తయ్య వేపుకు మళ్ళాయి. ఆ చూపుల్లో కోపం ఏమీ లేదు. రేఖా మాత్రంగా ప్రశంస కనిపించటం... నా భ్రమేనా లేక నిజమేనా అని అనుమానం వచ్చింది.

అప్పుడే ఎదురు వచ్చిన శాంతమ్మకు ఆ ట్రే అందించి నేను నా గదిలోకి వచ్చేశాను... అప్పుడే లీలగా నాకు ఇంకో మాట వినిపించింది. ఎవరో అన్నదానికి సమాధానంగా ఇంకెవరో అన్నారు కాబోలు... "చాల్లే.. శ్రీలక్ష్మితో పోలికేమిటి... ఇద్దరికీ నక్కకీ, నాగలోకానికీ ఉన్నంత తేడా ఉంటేనూ...." అని.

శ్రీలక్ష్మి ఎవరు... నాతో పోలిక ఎందుకూ... నీరజ శ్రీలక్ష్మి గురించి చెబుతానని, చూపిస్తానని అంది. తీరుబడిగా నీరజ కనిపించక పోవటంతో నేనే అడిగే వీలు చిక్కలేదు. అడగాలి... అనుకున్నాను.

ఆ రోజు నాకు తెలియని ఓ కొత్త సమాజాన్ని చూసిన అనుభూతి కలిగింది! ఎదుటివాళ్ళని నొప్పించటానికి ఏ మాత్రం సంకోచించని ధనగర్వం కొందరిలో ఏ

రీతిలో ఉంటుందో మొదటి సారి చూశాను. కమలాకరం గారింట్లో నాన్నగారు ఇలాంటి పరిస్థితులెన్ని చూశారో అనుకోగానే మనసు ఆర్ద్రమైపోయింది!

ఆ రోజు ఇంటికి వచ్చిన వాళ్ళందరూ.. తాతల తండ్రుల భర్తల సంపాదనతో ఒక అంతస్థునీ, హోదానీ అనుభవిస్తున్న వాళ్ళే! అదేదో తమ ప్రయోజకత్వమే అన్నట్లుగా అహంకారానికి మాత్రం తక్కువ లేదు! పై మెట్టుమీద ఉన్నవాళ్ళు ఆ అవకాశం, అదృష్టం కలిసివచ్చినందుకు సంతోషించవచ్చు గానీ క్రిందనున్న వాళ్ళని తక్కువగా చూడటమెందుకో...! ఎదుటివాళ్ళని తక్కువ చేసి మాట్లాడటంలోనే తమ గొప్పతనం ఉంటుందనే తప్పు అభిప్రాయం వలనేమో!

❈ ❀ ❈

"ఈ రోజు శాంతమ్మ మొహంలో చిన్న నవ్వు చూశాను..." అంటూ నీరజ వచ్చింది.

"శాంతమ్మ నవ్వటం కూడా వార్తేనా?" ఆశ్చర్యంగా అడిగాను.

"కాదా... నువ్వు గమనించలేదు కాబోలు. శాంతమ్మ ఎప్పుడూ తన పనిని అదేదో తపస్సు అన్నట్లుగా చేసుకుంటూ ఉంటుంది. మాటలే ఉండవు. ఇక నవ్వులేమిటిలే! వాళ్ళబ్బాయి రంగా వచ్చిన రోజుల్లో మాత్రం అతని జోక్స్‌కి కొంచెం నవ్వుతుంది. ఇక మిగతా రోజుల్లో ... మామూలే.... శాంతం! ఈ వేళ నవ్వు మొహంతో ఒక మాట చెప్పింది!" అంది.

"ఏమిటో... అది...?"

"చెన్నూరు నుండి వచ్చిన బంధువులకు నువ్వు చిన్న జర్క్... అంటే మెత్తగానే వాత పెట్టినట్లుగా సమాధానం చెప్పావట!" అంది నీరజ నవ్వుతూ.

"ఛ...ఛ... వాత... అదేం కాదు... నా అభిప్రాయం చెప్పానంతే!" అన్నాను.

"వాత అనే మాట శాంతమ్మ అన్లేదులే... నేనే అన్నాను. వాళ్ళేదో మాట్లాడుతోంటే నువ్వు సరిగ్గా సమాధానం చెప్పావంది!"

అప్పుడు నాకు వాళ్ళు కూడా శ్రీలక్ష్మి గురించి అనుకోవటం గుర్తుకు వచ్చి "శ్రీలక్ష్మి .. ఎవరో ఏమిటో చెబుతాననీ... చూపిస్తాననీ అన్నావ్?" అని అడిగాను.

ఎందుకోగానీ నీరజ నిశ్శబ్దమైపోయింది. అప్పటివరకూ మొహంలో కనుపించిన దరహాస ఛాయలు మాయమైపోయాయి!

"ఇప్పుడు.. అన్నయ్య వచ్చేవేళ కూడ అయిందిగా.. రేపు నాకు ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళే పని కూడా లేదు.. చెబుతాను..." మెల్లగా అంది.

ఏదో కథ కూడా ఉందా... నిదానంగానే చెప్పాలి కాబోలనుకున్నాను.

❋ ❀ ❋

బెడ్ పక్కనున్న సోఫాలో కూర్చున్న విష్ణు ఏదో ఆలోచనలో ఉన్నట్టుగా కనుపించారు. అలవాటుగా కుడిచేయి చూపుడు వేలు గాలిలో కదులుతుంటే నేను పక్కనే కూర్చుని "ఏమిటంత ఆలోచన... ఏమైనా సమస్యలా?" అని అడిగాను.

మాట్లాడలేదు.

చూపుడు వేలును పట్టుకుని "ఆర్చేదానివా... తీర్చేదానివా నీకెందుకన్నట్లుగా సమాధానం చెప్పరేం?" సీరియస్‌గా అన్నాను.

చిరునవ్వుతో చూసి "ఫైనాన్షియల్ ప్రోబ్లమే. తీర్చేదానివి కాకపోవటమేమిటి.. నువ్వు తల్చుకుంటే చిటికెలో అయిపోదూ!" అన్నారు.

ఒకక్షణం నేను ఉలిక్కిపడ్డాను. అమ్మ ఆస్తి గురించి చెప్పవద్దనుకున్నాంగా, నాన్నగారు అప్పుడే ఎందుకు చెప్పారో...!

"ఏమిటి ఆలోచిస్తున్నావ్.. ఈ రిజర్వ్ బ్యాంకు నాకు అప్పు ఇవ్వదా?" అన్నారు నా చేయిని పట్టుకుంటూ.

అప్పుడు నాకు గుర్తుకు వచ్చి 'అదా సంగతి' అనుకున్నాను.

ఒకసారి అంకుల్ వాళ్ళింట్లో విష్ణును కలిసినప్పుడు "ఈ ఊళ్ళో మీ పనులు పూర్తయ్యాయా?" అనడిగాను. "అప్పిచ్చేనాథుడి కోసం వెతుకులాటలో ఉన్నాం. దొరికితే మూడొంతుల పని పూర్తయినట్లే!" తమాషాగా అంటే... అప్పుడు కాలేజీలో నా ఫ్రెండ్స్ అందరూ నన్ను రిజర్వ్ బ్యాంకు అంటారనే విషయాన్ని నేను చెప్పాను.

నా క్లాస్‌మేట్స్‌లో చాలామంది ఇంట్లో వాళ్ళు ఫీజులకీ, బుక్స్‌కనీ ఇచ్చిన డబ్బును సినిమాలకీ, రెస్టారెంట్స్‌కీ ఖర్చు చేసేసి, ఫీజులు కట్టాల్సిన సమయానికి అప్పుకోసం చూస్తుంటారు. ఎవరైనా బర్త్‌డే పార్టీలని పిలిస్తే తప్ప రెస్టారెంట్స్‌కి నేను ఫ్రెండ్స్‌తో వెళ్ళను. ఎప్పుడైనా నాన్నగారు, భవానీ ఆంటీ వాళ్ళతో మాత్రం అప్పుడప్పుడు వెళ్ళటమే అలవాటు. అందువల్లే నాన్నగారు నాకు ప్రతీ నెలా ఇచ్చే పాకెట్‌మనీ అలా

ఉండిపోతుంటుంది. అప్పులు అడిగినవాళ్ళకు సర్దుబాటు చేస్తుంటాను కాబట్టి వాళ్ళు నాకు రిజర్వ్ బ్యాంక్ అని పేరు పెట్టారు.

ఈ విషయం విష్ణుకు చెప్పి "మీక్కూడా ఉపయోగపడతానేమో చూసుకోండి.." సరదాగా అన్నాను.

"మీ ఫ్రెండ్స్‌కి ఉన్న లోన్ ఫెసిలిటీ నాకూ శాంక్షన్ చేస్తున్నారంటే... నన్నూ మీ ఫ్రెండ్స్ జాబితాలోకి చేర్చినందుకు థేంక్స్... అవసరం వచ్చినప్పుడు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటాను..." అల్లరిగా నవ్వుతూ అన్నారు.

అది గుర్తుకు వచ్చే విష్ణు అలా అన్నారని అర్థమైంది.

మా పెళ్ళికి ముందు నాన్నగారు నా చేతిలో చెక్‌బుక్ పెడుతూ "పది లక్షలు నీ పేర ఉన్నాయి. నీ పెళ్ళి కోసమని కొంచెం కొంచెంగా పొదుపు చేసిన మొత్తమిది. విష్ణు తీసుకోరని తెలుసు. మీ ఇద్దరికీ ఉపయోగపడేవిధంగా ఏం చేసినా... మీ ఇష్టమే" అన్నారు.

నేను అనాలోచితంగా వెంటనే "ఇదేమిటి నాన్నా.. మీరు ఇలా చేస్తున్నారు?" అనేశాను.

నాన్నగారి పెళ్ళిలో కమలాకరం గారు చేసినట్లే నాన్నగారూ చేస్తున్నారనే అర్థంతో మాట్లాడానని అప్పుడు నాకు స్ఫురించింది.

"అప్పటి పరిస్థితులకీ, ఇప్పటికీ పోలికే లేదు! నీకు వివేకం, విచక్షణా జ్ఞానం ఉన్నాయి. విష్ణు వ్యక్తిత్వం గురించి తెలుసు. మీరిద్దరూ ఒకరికొకరుగా ఉన్నంతకాలం ఇతరుల ప్రమేయంతో వచ్చే సమస్యలూ మిమ్మల్నేమీ చేయలేవు! ఎటువంటి సమస్యలొచ్చినా పరిష్కరించుకునే సామర్థ్యం నీలో ఉందనే నా నమ్మకం! మీ అమ్మ నాకు సపోర్టుగా ఉండి ఉంటే నా జీవితం బాగానే ఉండేది. తను తెలుసుకుని సరిదిద్దుకుందామనుకునేసరికి జీవితమే చేజారిపోయింది!"

నాపై నాన్నగారికున్న నమ్మకానికి అప్పుడు చాలా సంతోషం కలిగింది!

"ఈ డబ్బుతో మనం ఏం చేయాలి... ఏ విధంగా ఖర్చు పెట్టాలన్నది మాత్రం పూర్తిగా మీ ఇష్టప్రకారమే జరగాలి... అది నా కోరిక!" అని విష్ణుకు చెబితే "సరే ... ఆలోచిద్దాం" అన్నారప్పుడు.

ఇప్పుడు మళ్ళీ ఆ విషయాన్ని గుర్తు చేశాను. "చూద్దాం.. తొందరేముందీ!" అన్నారు.

విష్ణు వాళ్ళ బిజినెస్ వ్యవహారాల గురించి నాకేమీ తెలియదు. మామయ్య గారి అనారోగ్యం వల్ల కొన్నింటినుండి తప్పుకోవటం, కొన్నింటిని పార్టనర్స్ నుండి పూర్తిగా తీసుకోవటం చేయాల్సి ఉండటంతో పెద్ద మొత్తంలో డబ్బు అవసరమని అప్పుడు విన్నాను. ఎంత సమకూరిందీ, ఇంకా ఎంత అవసరం లాంటి విషయాలూ నేను అడగలేదు.. విష్ణు చెప్పనూ లేదు. బిజినెస్ చికాకుల్లో ఉన్న విష్ణుకు నేను చేయగల సాయం ఒక్కటీ.. నావేపు నుండి ఎటువంటి సమస్యలూ లేకుండా చూడటమే! అందుకే.. ఇంట్లో నాకెటువంటి అప్రియమైన అనుభవాలు కలిగినా విష్ణుకు చెప్పకుండా ఉండాలని నిర్ణయించుకొన్నాను.

ఆ మరునాడు అవసరాన్ని బట్టి ఢిల్లీ వెళ్ళాల్సి ఉంటుందని విష్ణు చెప్పారు.

మరునాడు ఉదయం ప్రయాణం నిర్ణయమైందనీ రెండు మూడు రోజులు ఉండాల్సి రావచ్చనీ విష్ణు చెప్పారు. మధ్యాహ్నాలు భోజనానికి ఎప్పుడో గానీ ఇంటికి రావటం లేదు గనుక ఉదయమే తన బట్టలు చిన్న సూట్‌కేసులో సర్దిపెట్టుకున్నారు.

"సాయంకాలం వచ్చినప్పుడు నీకు కొంత పని అప్పచెప్పే వెళ్తాను. రోజంతా నీకు కంప్యూటర్ ముందే గడిచిపోతుంది... కాలక్షేపం గురించి చింతించాల్సిన పనేం లేదు. బాగా చెస్తే..."

నేను మధ్యలోనే అడ్డం వెళ్ళి "ఏం ఇస్తారు?" అనడిగాను.

"ఇంకొంచెం ఎక్కువ వర్క్ ఇస్తాను!" అంటూ నవ్వేశారు.

"బావుంది... మీ ఆఫీసులో కూడా ఇదే పద్ధతా... బాగా పని చేసిన వాళ్ళకి శాలరీ కాకుండా పనే పెంచుతారన్నమాట!" అంటూ నేనూ నవ్వాను.

❊ ❀ ❊